నల్లరిబ్బన్లు ధరించి పెన్షన్ల పంపిణీ

సచివాలయ ఉద్యోగుల వినూత్న నిరసన

నరసాపురం: తమ న్యాయమైన డిమాండ్లు పరిష్కరించాలని కోరుతూ సచివాలయ ఉద్యోగులు బుధవారం నల్ల రిబ్బన్లు ధరించి పెన్షన్లు పంపిణీ చేసి నిరసన తెలిపారు. స్పష్టమైన జాబ్‌చార్ట్ అమలు, సీనియర్ అసిస్టెంట్ పేస్కేల్ వర్తింపు, ప్రమోషన్ ఛానల్ రూపకల్పన, సర్వీస్ రూల్స్ రూపకల్పన, నోషనల్ ఇంక్రిమెంట్లు మంజూరు, మదర్ డిపార్టుమెంట్‌తో అనుసంధానం వంటి డిమాండ్లను తక్షణమే నెరవేర్చాలని డిమాండ్ చేశారు.

నల్లరిబ్బన్లు ధరించి పెన్షన్ అందిస్తున్న సచివాలయ ఉద్యోగి

3 నెలలు వరదల్లోనే..!

పోలవరం నిర్వాసితుల పరిస్థితి అత్యంత దుర్భరం

జులై నుంచి ఇప్పటి వరకూ 8 సార్లు గోదావరికి వరద

నెలలు తరబడి జల దిగ్బంధనంలో కుక్కునూరు, వేలేరుపాడు మండలాలు

వాగుల ఉగ్రరూపంతో కాలు బయట పెట్టలేని పరిస్థితి

నిర్వాసితులకు పరిహారం ఇవ్వకుండా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మోసం

ట్రాక్టర్‌పై సామాన్లు వేసుకుని తరలిపోతున్న నిర్వాసితులు (ఫైల్‌ఫొటో)

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

పోలవరం నిర్వాసితులు అత్యంత దుర్భర పరిస్థితి అనుభవిస్తున్నారు. నెలలు తరబడి వరదల్లోనే ఏజెన్సీ గిరిజనుల జీవితాలు మగ్గిపోతున్నాయి. ప్రతియేటా కంటే ఈసారి గోదావరి వరదలకు కుక్కునూరు, వేలేరుపాడు మండలాల ప్రజలు ప్రత్యక్ష నం ˜కం చూస్తున్నారు. గతంలో ఎన్నడూ లేనివిధంగా ఈ ఏడాది జులై మొదటివారం నుంచి అక్టోబర్ మొదటి తేదీ నాటికి మూడు నెలల్లో గోదావరికి ఎనిమిదిసార్లు వరద పోటెత్తింది. ఒకే ఏడాది ఇన్నిసార్లు వరద ఎప్పుడూ రాలేదని అధికారులు చెబుతున్నారు. ఈ ఏడాది జులై 12న మొదటిసారి గోదావరికి వరద వచ్చింది. భద్రాచలం వద్ద గోదావరి నీటిమట్టం 41.30 అడుగులు నమోదై మొదటి ప్రమాద హెచ్చరికకు చేరువవుతూ తగ్గుముఖం పట్టింది. ఇక వరద ప్రమాదం తప్పినట్లేనని అంతా భావించారు. ఆ తర్వాత ఆగస్టు, సెప్టెంబర్ నెల ల్లోనూ వరద ఉధృతి కొనసాగింది. ఎనిమిదిసార్లు పోటెత్తిన వరద లకు భద్రాచలం వద్ద నీటిమట్టం నాలుగుసార్లు 43 అడుగులు దాట డంతో మొదటి ప్రమాద హెచ్చరిక, మూడుసార్లు 48 అడుగులు దాట డంతో రెండో ప్రమాద హెచ్చరికలు జారీ చేసిన పరిస్థితి ఉంది. జులైలో మొదటిసారి వచ్చిన వరద మాత్రమే 41.30 అడుగుల వరకూ చేరి వెనక్కి తగ్గింది. ప్రస్తుతం సెప్టెంబర్ 27న మొదలైన వరద 30వ తేదీ కి భద్రాచలం వద్ద 50 అడుగులు దాటి మంగళ వారం నుంచి తగ్గు ముఖం పట్టిన పరిస్థితి ఉంది. వరదలకు కుక్కు నూరు మండలం లోని గుండేటి వాగు, వేలేరుపాడు మండలం లోని ఎద్దువాగులు ఉధృ తంగా ప్రవహించడంతో గ్రామాలకు రాకపో కలు నెలలు తరబడి పూర్తిగా నిలిచిపోయాయి. మూడు నెలలుగా అక్క డి ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వరద ఉధృతి పెరిగి నప్పుడు పునరా వాస కాలనీలకు తరలివెళ్లడం, తగ్గుముఖం పట్టాక గ్రామాలకు చేరడం సర్వసాధారణమైంది. మిర్చి నారు దెబ్బతినడంతో రైతులు నష్టాలు సైతం చవిచూశారు. ఉపాధి లేక జీవనం దుర్భరంగా తయారైంది.

పరిహారం ఇవ్వకుండా ఏళ్ల తరబడి ముప్పతిప్పలు

2026 చివరికల్లా పోలవరం ప్రాజెక్టు పూర్తి చేస్తామని ప్రభుత్వం పదేపదే చెబుతోంది. ఇప్పటికే దాదాపు 80 శాతం పనులు పూర్తయినట్లు నేతలు చెప్పుకొస్తున్నారు. ప్రాజెక్టుతో సర్వం కోల్పోతున్న నిర్వాసితులకు మాత్రం 12 శాతం పునరావాస ప్రక్రియ కూడా పూర్తికాని పరిస్థితి ఉంది. కుక్కునూరు, వేలేరుపాడు మండలాల్లో దాదాపు 110కుపైగా గ్రామాలు ముంపుబారిన పడుతున్నాయి. 41.15 కాంటూరు, 45.75 కాంటూరు కింద ముంపు గ్రామాలను విభజన చేసి పరిహారం అందిస్తామని ప్రభుత్వం చెప్పింది. కాంటూరు లెక్కలన్నీ తప్పుగా నమోదు చేశారని, చిన్నపాటి వరదొచ్చినా కాంటూరుతో సంబంధం లేకుండా గ్రామాలన్నీ మునుగుతున్నాయని నిర్వాసితులు గగ్గోలు పెడుతున్నారు. 41.15 కాంటూరు పరిధిలో 40 గ్రామాల వరకూ ఉండగా ఇప్పటికీ పూర్తిస్థాయిలో పునరావాస ప్యాకేజీని అందించలేదు. ఇంటి పరిహారంగాని, 18 ఏళ్లు నిండిన యువతకు పరిహారంగాని, ఇంకా అనేక మందికి భూమికి భూమి ఇవ్వడం, నిర్వాసిత కాలనీల నిర్మాణం ఏఒక్కటీ పూర్తి చేయని పరిస్థితి ఉంది. గ్రామం వదిలొస్తే ప్రభుత్వం పరిహారం ఇచ్చే పరిస్థితి ఉండదు. పోలవరం మండలంలో ఖాళీ చేసిన గ్రామాల ప్రజల పరిస్థితిని అంతా ప్రత్యక్షంగా చూశారు. దీంతో తమకు పూర్తిస్థాయి పరిహారం ఇచ్చిన తర్వాతే గ్రామాలు ఖాళీ చేస్తామని నిర్వాసితులు చెబుతున్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మాత్రం పోలవరం నిర్వాసితుల గోడు పట్టించుకోకుండా గాలికొదిలేసింది. దీంతో నెలలు తరబడి వరదలకు ఎదురొడ్డి జీవనం సాగించాల్సిన దుస్థితి నిర్వాసితులకు ఏర్పడింది.

కలెక్టరేట్ వద్ద నినదిస్తున్న పిహెచ్‌సి వైద్యులు

పిహెచ్‌సి వైద్యులను విస్మరించిన ప్రభుత్వం

కరోనా కాలంలో ప్రాణాలు ఫణంగా పెడితే ఇంత నిర్లక్ష్యమా

సమస్యలు పరిష్కరించకపోతే ఆందోళన కొనసాగిస్తాం

కలెక్టరేట్ వద్ద పిహెచ్‌సి వైద్యుల నిరసన

ప్రజాశక్తి - భీమవరం

పిహెచ్‌సిల్లో ఎన్నోఏళ్ల నుంచి వైద్య సేవలందిస్తున్న తమను ప్రభుత్వం విస్మరిస్తుందని వైద్యులు ఆవేదన వ్యక్తం చేశారు. తమ సమస్యలను పక్కనపెట్టి గ్రామీణ ప్రాంతాల్లో వైద్యం అందించాలని చెప్పడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. స్థానిక కలెక్టరేట్, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయం ఎదుట ఎపి పిహెచ్‌సి వైద్యుల అసోసియేషన్ (ఎపిపిహెచ్‌సిడిఎ) ఆధ్వర్యంలో బుధవారం నిరసన వ్యక్తం చేశారు. జిల్లా నలుమూలల నుంచి వచ్చిన వైద్యులు స్థానిక తిరుమల విద్యాసంస్థల నుంచి కలెక్టరేట్ వరకు ర్యాలీ నిర్వహించారు. తమ సమస్యలు పరిష్కరించాలని నినదించారు. ఈ సందర్భంగా అసోసియేషన్ నేతలు మాట్లాడుతూ పిహెచ్‌సి వైద్యాధికారులకు 25 ఏళ్ళుగా టైమ్‌బౌండ్ ప్రమోషన్లు లభించకపోవడం దారుణమన్నారు. పొరుగు రాష్ట్రాలన్నింటిలోనూ నిరంతరం అమలవుతున్నా ఈ హక్కు, ఎపిలో అమలు కావడం లేదని ఆరోపించారు. ఎపివివిపిలో మూడేళ్ల అనుభవం ఉన్న సిఎఎస్‌లకు ప్రమోషన్లు మంజూరు చేశారని, 25 ఏళ్లుగా సేవలందిస్తున్న డైరెక్టర్ ఆఫ్ పబ్లిక్ హెల్త్ పరిధిలోని వైద్యులు మాత్రం ప్రమోషన్ల కోసం ఎదురు చూస్తూ రిటైర్ అవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. జిఒ 99 ద్వారా ఇన్‌సర్వీస్ పీజీ కోటా 15 శాతానికి తగ్గించి, అదీ ఆరు విభాగాలకు మాత్రమే పరిమితం చేయడాన్ని ఖండించారు. కరోనా మహమ్మారి సమయంలో తమ ప్రాణాలను సైతం ఫణంగా పెట్టి ప్రజల ప్రాణాలను రక్షించినప్పటికీ తమపై ప్రభుత్వ నిర్లక్ష్యం వహించడం అన్యాయమన్నారు. ప్రభుత్వం తమ న్యాయమైన డిమాండ్లు పరిష్కరించాలని, లేనిపక్షంలో ఆందోళన కొనసాగిస్తామని హెచ్చరించారు.

ఆచంట: కరుగోరుమిల్లి వద్ద గోదావరి ఉధృతి

వరద గోదావరి

కొనసాగిన ఉధృతి

నీట మునిగిన పల్లపు లంకలు, ఘాట్లు

ఆందోళనలో లంక గ్రామాల ప్రజలు

ప్రజాశక్తి - ఆచంట

వశిష్ట గోదావరి ఉరకలేస్తోంది. బుధవారం సాయంత్రం నాటికి కోడేరు వద్ద వరద ఉధృతి మరింత పెరిగింది. కోడేరు, పెదమల్లం, కరుగోరుమిల్లి, భీమలాపురం పుష్కరఘాట్లు నీట మునిగాయి. తహశీల్దార్, రెవెన్యూ సిబ్బంది అనగార్లంక, పెదమల్లం లంక, అయోధ్యలంక గ్రామాల్లో పర్యటించి అక్కడి ప్రజలను అప్రమత్తం చేశారు. లంక భూముల్లోకి వరద నీరు మెల్లగా చేరుతోంది. వరద మరో మూడు అడుగుల మేర పెరిగితే లంక గ్రామాల్లోకి నీరు ప్రవేశించే ప్రమాదం ఉంది. లంక గ్రామాల్లో పాడి రైతులు తమ పశువులను సురక్షిత ప్రాంతాలకు తరలిస్తున్నారు. ఏటిగట్టుకు దిగువన ఉన్న లంక భూములు ముంపునకు గురి కావడంతో కూరగాయ, కొబ్బరి తోటలు నీట మునిగాయి.



నరసాపురం వద్ద గోదావరి ఉధృతి

మండలంలోని కోడేరు, పెదమల్లం, కరుగోరుమిల్లి, భీమలాపురం రేవుల్లో అధికారులు ఇంజిన్ పడవలను ఏర్పాటు చేశారు.

యలమంచిలి: మండలంలో గోదావరి వరద బుధవారం ఉగ్రరూపం దాల్చింది. లంక గ్రామాలైన కనకాయలంక, పెదలంక, బాడవ, యలమంచిలి లంక, లక్ష్మీపాలెం గంగడపాలెం, అబ్బిరాజుపాలెం, దొడ్డిపట్ల, బూరుగుపల్లి, కంచుస్తంభం పాలెం తదితర గ్రామాల్లోని కొబ్బరి తోటలు, పల్లపు ప్రాంతాల్లో ఉన్న ఇళ్ల వద్దకు వరద నీరు భారీగా చేరింది. కనకాయలంక గ్రామస్తులు పడవలపైనే రాకపోకలు సాగిస్తున్నారు. కనకాయలంక, పెదలంక గ్రామాల్లో నరసాపురం ఆర్‌డిఒ దాసి రాజు బుధవారం మధ్యాహ్నం పర్యటించారు. వరద పరిస్థితిని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, ప్రభుత్వపరంగా అన్ని ముందస్తు జాగ్రత్తలు తీసుకున్నామని తెలిపారు. ఆయన వెంట తహశీల్దార్ గ్రంధి పవన్‌కుమార్, టిడిపి నాయకులు ముస్కుడి రాంబాబు, ముస్కుడి శ్యాంబాబు, తాళ్ల నాగరాజు, ఆకుమర్తి శ్రీనివాస్, సిబ్బంది ఉన్నారు.

నరసాపురం: నరసాపురం వద్ద వశిష్ట గోదావరికి వరద ఉధృతి ఎక్కువగా ఉంది. ఇక్కడ గోదావరి నిండుకుండలా మారింది. బుధవారం నాల్గో రోజు కూడా ఉభయగోదావరి జిల్లాల మధ్య పంటు రాకపోకలు నిలిపివేశారు. మరో రెండు రోజులు వరద ఉధృతి ఇదే విధంగా కొనసాగే అవకాశం ఉందని అధికారులు చెబుతున్నారు. వలందరరేవులో వరద నీరు గోదావరి మాత విగ్రహాన్ని తాకుతోంది. పొన్నపల్లిలో శ్మశానం నీట మునిగింది.

యలమంచిలి: స్థానికులతో మాట్లాడుతున్న ఆర్‌డిఒ రాజు

రక్త నిధిని వినియోగించుకోవాలి

బ్లడ్ బ్యాంక్ ప్రారంభోత్సవంలో కలెక్టర్ నాగరాణి, విప్ బొలిశెట్టి శ్రీనివాస్

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

అత్యవసర పరిస్థితుల్లో రక్తం ఎంతో విలువైందని, రక్త నిధిని సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ చదలవాడ నాగరాణి తెలిపారు. బుధవారం ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలో ఏర్పాటు చేసిన బ్లడ్‌బ్యాంకును కలెక్టర్ నాగరాణి, విప్ బొలిశెట్టి శ్రీనివాస్ సంయుక్తంగా ప్రారంభించారు. తొలుత రక్తదానం చేస్తున్న పోలీస్ అధికారులను, సిబ్బందిని అభినందించారు. ఈ సందర్భంగా కలెక్టర్ నాగరాణి మాట్లాడుతూ అనుకోని ప్రమాదాలు ఎదురైనప్పుడు ప్రాణాలను కాపాడేందుకు రక్తం ఎంతో విలువైందన్నారు. రక్తం తయారు చేయలేనిదని, రక్త సేకరణ ద్వారానే ఆపన్నులకు అందించగలమని అన్నారు. రక్తదానానికి దాతలు ముందుకు రావాలని కోరారు. విప్, ఎంఎల్‌ఎ బొలిశెట్టి శ్రీనివాస్ మాట్లాడుతూ తాడేపల్లిగూడెంలో ఇది రెండో బ్లడ్‌బ్యాంక్ అని, ఏరియా ఆసుపత్రికి సొంతంగా బ్లడ్ బ్యాంకును సమకూర్చుకోవడం సంతోషకరమైన విషయమని అన్నారు. ప్రతిఒక్కరూ రక్తదానం ద్వారా ప్రాణాలు కాపాడే సూత్రధారులు కావాలని పిలుపునిచ్చారు.

స్వస్థ్ నారీ, సశక్త్ పరివార్ అభియాన్‌లో భాగంగా ఏరియా ఆసుపత్రిలో ఏర్పాటు చేసిన వైద్య శిబిరాన్ని కలెక్టర్ విప్‌తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా శిబిరంలో అందిస్తున్న వైద్య సేవలపై ఆరా తీశారు. పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి చికిత్స, మందులు అందజేయాలని సూచించారు. స్త్రీ, శిశుసంక్షేమ శాఖ ద్వారా ఏర్పాటు చేసిన పౌష్టికాహార వస్తువుల ప్రదర్శనను తిలకించారు. ఈ సందర్భంగా గర్భవతులకు సీమంతం, చిన్నారులకు అన్నప్రాసన నిర్వహించారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ టి.రాహుల్‌కుమార్‌రెడ్డి, డిఎంహెచ్‌ఒ డాక్టర్ జి.గీతాబాయి, డిసిహెచ్‌ఎస్ డాక్టర్ పి.సూర్యనారాయణ, ఐసిడిఎస్ పీడీ డి.శ్రీలక్ష్మి, ఏరియా హాస్పిటల్ సూపరింటెండెంట్ డాక్టర్ బి.రవిపాల్, సిడిపిఒ టిఎల్.సరస్వతి, కూటమి నాయకులు, ఆసుపత్రి వివిధ విభాగాల వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

బ్లడ్ బ్యాంక్‌ను ప్రారంభించిన కలెక్టర్, విప్

స్కీం వర్కర్లకు కనీస వేతనాలివ్వాలి

సిఐటియు మండల మహాసభలో జిల్లా అధ్యక్షులు జెఎన్‌వి.గోపాలన్

ప్రజాశక్తి - ఆకివీడు

స్కీం వర్కర్స్ అందరికీ సంక్షేమ పథకాలు అమలు చేసి కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని సిఐటియు జిల్లా అధ్యక్షులు జెఎన్‌వి.గోపాలన్ డిమాండ్ చేశారు. బుధవారం సిఐటియు మండల మహాసభ స్థానిక ప్రజాసంఘాల కార్యాలయంలో జరిగింది. బొర్రా శ్రీను, తోట పద్మ, రమాదేవి ఈ సమావేశానికి అధ్యక్షత వహించారు. కార్యక్రమం ప్రారంభంలో సిఐటియు జెండాను మాజీ జిల్లా అధ్యక్షులు బి.ఆదామ్ ఆవిష్కరించారు. కె.తవిటి నాయుడు మూడు సంవత్సరాల కార్యదర్శి నివేదిక ప్రవేశపెట్టారు. ఈ నివేదికను సభ ఏకగ్రీవంగా ఆమోదించింది. అనంతరం జిల్లా అధ్యక్షులు గోపాలన్ మాట్లాడుతూ అధికారంలోకి రాకముందు చేసిన వాగ్దానాలు తుంగలో తొక్కి కార్మిక వర్గంపై అదనపు పని గంటలు పెంచారన్నారు. స్కీం వర్కర్లకు పెన్షన్ వంటి కార్యక్రమాలను అప్పజెప్పి ఒత్తిడి చేస్తున్నారన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఈ రకమైన కార్మిక కర్షక వ్యతిరేక విధానాలను కార్మిక వర్గం తిప్పి కొట్టాలని పిలుపునిచ్చారు. ఈ మహాసభలో బొడ్డుపల్లి రాంబాబు, పెంకి అప్పారావు, నంగెడ్డ కొండ, తమ్మిశెట్టి కృష్ణ, గండేటి ఈశ్వరరావు, వై.రామలక్ష్మి, బెవర నారాయణమ్మ పాల్గొన్నారు.

మాట్లాడుతున్న జెఎన్‌వి.గోపాలన్

ఎరువులు మాయంపై చర్యలు

జిల్లా వ్యవసాయాధికారి జెడ్.వెంకటేశ్వరరావు

పెనుమంట్ర : మండల కేంద్రంలోని పెనుమంట్ర డిసిఎంఎస్ స్టాక్ పాయింట్లో ఎరువులు మాయంపై చర్యలు చేపట్టామని, ఈమేరకు డిపో సేల్స్ మెన్‌కు నోటీసులు ఇచ్చినట్టు వ్యవసాయ శాఖ అధికారి జెడ్ వెంకటేశ్వరరావు బుధవారం ఆలమూరులో తెలిపారు. స్టాక్ పాయింట్లు 25 టన్నుల యూరియా మాయం అయిందని, అన్ని పత్రికల్లో వచ్చిన కథనంపై విజిలెన్స్ అధికారులు తనిఖీలు చేపట్టారని, ఈపాస్ లేకుండా ఒక్కరోజులోనే 23 టన్నుల యూరియా విక్రయించినట్లు నమోదు చేసిన డిసిఎంఎస్ ఎరువుల విక్రయ కేంద్రంలో సేల్స్ మెన్‌గా పనిచేసిన జి.రవికుమార్‌కు సోకాజ్ నోటీసు జారీ చేశామని చెప్పారు. ఇప్పటికే డిసిఎంఎస్ అధికారులు సేల్స్ మెన్‌ను విధుల నుండి తొలగించినట్లు వ్యవసాయ అధికారులకు సమాచారం అందించారని, ఆరు రోజుల వ్యవధిలో సోకాజ్ నోటీస్ వివరణ తీసుకున్నానంతరం తదుపరి చర్యలకు అధికారులను ఆదేశిస్తామని జిల్లా వ్యవసాయాధికారి జెడ్ వెంకటేశ్వరరావు వివరించారు.

సమస్యల నిలయం మోగల్లు ప్రభుత్వ కాలనీ

అధికారులు, ప్రజాప్రతినిధులవి అరకొర చర్యలే

సమస్యలు పరిష్కరించకపోతే లబ్ధిదారులతో ఆందోళనకు సిద్ధం

సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు బి.బలరాం

ప్రజాశక్తి - పాలకోడేరు

మోగల్లు ప్రభుత్వ కాలనీ సమస్యలకు నిలయంగా మారిందని, ఈ కాలనీవాసులు సమస్యలతో సతమతమవుతున్నారని సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు బి.బలరాం అన్నారు. మోగల్లు ప్రభుత్వ కాలనీని బుధవారం సిపిఎం మండల కమిటీ ఆధ్వర్యంలో ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా నివాసితులతో మాట్లాడి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఆ ప్రాంతవాసులు అనేక సమస్యలను సిపిఎం నేతల దృష్టికి తీసుకొచ్చారు. ఈ సందర్భంగా బలరాం మాట్లాడుతూ మోగల్లు ప్రభుత్వ కాలనీలో అనేక సమస్యలు తాండవిస్తున్నాయన్నారు. చిన్నపాటి వర్షానికి మోకాల్లోతు నీరు చేరుతున్న పరిస్థితి ఇక్కడ ఉందన్నారు. విష సర్పాలు సంచరిస్తున్నాయని, ఇటీవల ఒకరు పాముకాటుకు గురై ప్రాణాపాయం నుంచి బయట పడ్డారని చెప్పారు. ప్రజాప్రతినిధులు, అధికారులు అరకొరగానే చర్యలు తీసుకుంటున్నారని, శాశ్వత పరిష్కారానికి చర్యలు తీసుకోకపోవడం దారుణమని అన్నారు. ముఖ్యంగా రోడ్లు, డ్రెయినేజీ సమస్య తీవ్రంగా వేధిస్తుందన్నారు. పబ్లిక్ కొళాయిలు తక్కువగా ఉండడంతో పూర్తిస్థాయిలో తాగునీరందని పరిస్థితి ఉందన్నారు. డ్రెయినేజీ సౌకర్యం లేకపోవడంతో తాగునీరు కలుషితమవుతుందన్నారు. కాలనీలో వీధిలైట్లు, మౌలిక వసతులు కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ ప్రాంతంలో విద్య, వైద్యం సదుపాయం లేదని, తక్షణం వాటిని ఏర్పాటు చేయాలని కోరారు. మిగిలిన ప్రభుత్వ కాలనీల్లోనూ సమస్యలు అలానే ఉన్నాయని, వాటి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. లేనిపక్షంలో కాలనీవాసులతో కలిసి ఆందోళన చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి శేషపు అశ్రియ్య, నాయకులు పాలా వెంకటస్వామి, వీరవల్లి వెంకటేశ్వరరావు, దివ్య, పావని కాలనీవాసులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న బి.బలరాం

బాణాసంచా వ్యాపారులు నిబంధనలు పాటించాలి

సిఐ బి.యాదగిరి

ప్రజాశక్తి - నరసాపురం

బాణాసంచా వ్యాపారాన్ని నిర్వహించే వ్యాపారులు తప్పనిసరిగా నిబంధనలు పాటించాలని నరసాపురం సిఐ బి.యాదగిరి అన్నారు. మండలంలోని చిట్టవరం, నవరసాపురం గ్రామలలో నిర్వహిస్తున్న బాణాసంచా షాపులు ఆకస్మిక తనిఖీ చేశారు. షాపులో ఉన్న స్టాక్ వివరాలు, బిల్లులు, గొడౌన్ పరిశీలించి మాట్లాడారు. అక్రమంగా బాణా సంచాలను నిల్వ చేస్తే చట్టరీత్యా చర్యలు తప్పవని హెచ్చరించారు. అధికారులు సూచించిన ప్రదేశంలోనే తగు నిబంధనలు పాటించి విక్రయాలు జరపాలని, అలా కాకుండా పర్మిషన్ లేకుండా ఎవరైనా విక్రయాలకు పాల్పడితే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. బాణాసంచా విక్రయ ప్రదేశాలలో చిన్నపిల్లలు లేకుండా చూసుకోవాలని, వాటర్ డ్రమ్, బకెట్లు కూడా అందుబాటులో ఉంచుకోవాలన్నారు.

ఎండ ప్రభావంతో నిర్మానుష్యంగా మారిన జాతీయ రహదారి

రాత్రి సమయంలో కురుస్తున్న వర్షం

వాతావరణ మార్పులతో..

ప్రజలు అనారోగ్యం పాలు

ముందస్తు జాగ్రత్తలు పాటించాలి : వైద్య నిపుణులు

ప్రజాశక్తి - నరసాపురం

పగలంతా మండిపోతున్న ఎండ, అంతలోనే ఆకాశం మేఘావృతమై చెదురుమదురు వర్షాలు.. ప్రస్తుతం ఇలాంటి విభిన్న వాతావరణ పరిస్థితులతో జనం ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. వర్షాకాలం ప్రభావంతో ఈరోజుల్లో వాతావరణ మార్పుల కారణంగా చిన్నారులు అనారోగ్యం పాలవుతున్నారు. ఈనేపథ్యంలో తగిన ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని వైద్య నిపుణలు సూచిస్తున్నారు.

ప్రస్తుత సీజన్‌లో పిల్లలకు ప్రధానంగా జలుబు, దగ్గు, జ్వరం వస్తుంది. అలాగే నిలిచిన వాన నీరు, మురికి నీటిలో ఆటలాడటం వల్ల కొన్నిరకాల చర్మవ్యాధులు వచ్చే అవకాశం ఉంది. కాలివేళ్ల సందుల్లో తేమ చేరి ఒరిసిపోయే ప్రమాదం ఉంది. కలుషిత నీటిని తాగడం వల్ల జీర్ణక్రియపై ప్రభావం చూపి వాంతులు, విరోచనాలు, పచ్చకామెర్లు వచ్చే అవకాశం ఉంది. దోమల ఉధృతి కారణంగా మలేరియా, డెంగీ, టైఫాయిడ్, వైరల్ జ్వరాలు వస్తాయి. తగిన జాగ్రత్తలు పాటిస్తే ఇలాంటి వ్యాధుల బారిన పడకుండా రక్షణ పొందవచ్చు.

ఇవి పాటించండి..

ఆహారం తినే ముందు, మల, మూత్ర విసర్జన తరువాత చేతులను సబ్బుతో శుభ్రం చేసుకోవాలి.

కాచి చల్లార్చిన నీటినే తాగాలి. తాజా ఆహార పదార్థాలు మాత్రమే తీసుకోవాలి.

ఆహారంపై ఈగలు వాలకుండా మూతలు పెట్టాలి.

దోమలు వ్యాప్తి చెందకుండా నివారణా చర్యలు చేపట్టాలి.

నిర్లక్ష్యం వద్దు..



ఆర్.సంతోష్‌కుమార్, ఏరియా ఆసుపత్రి సూపరిటెండెంట్, నరసాపురం

ఆరోగ్యంపై ప్రభావం చూపే ఆహారపదార్థాలు పిల్లలకు పెట్ట కుండా తల్లిదండ్రులు జాగ్రత్తలు తీసుకోవాలి. ముఖ్యంగా జంక్ ఫుడ్స్‌కు దూరంగా ఉండాలి. వేడివేడి ఆహార పదార్థాలే భుజించేలా చూడాలి. ఇంట్లో వండిన ఆహారాన్ని మాత్రమే పిల్లలకు ఇవ్వడం ద్వారా చాలా వరకు వ్యాధుల బారిన పడకుండా చూసుకోవచ్చు. జ్వరాలు వస్తే నిర్లక్ష్యం చేయకుండా వెంటనే వైద్యులను సంప్రదించాలి.

చేతుల శుభ్రతతో ఆరోగ్యం

ఎం.మాధురి, పిహెచ్‌సి వైద్యురాలు, ఎల్‌బి చర్ల

చిన్నపిల్లలు చేతులను తగిన విధంగా శుభ్రం చేసుకొనేలా తల్లిదండ్రులు పర్యవేక్షించాలి. ఆహారం తినే ముందు, తర్వాత చేతులను శుభ్రపరుచుకునేలా అలవాటు చేయాలి. ఇంటి పరిసరాలు శుభ్రంగా ఉండేలా చూసుకోవాలి. ప్రస్తుత వాతావరణ మార్పులతో వ్యాధుల ముప్పు ఎక్కువగా ఉన్నందున అప్రమత్తంగా ఉండాలి.

ఆర్థిక ఆసరాగా సామాజిక పెన్షన్లు: కలెక్టర్

భీమవరం: ఆర్థిక ఆసరాగా ఎన్‌టిఆర్ భరోసా సామాజిక పింఛన్లు తోడ్పాటు అందిస్తున్నాయని, లబ్ధిదారుల మాటల్లో అది స్పష్టంగా విన్పిస్తోందని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి అన్నారు. పట్టణంలోని ఆదర్శనగర్, కాత్రేగుంటలో బుధవారం ఎన్‌టిఆర్ భరోసా పెన్షన్ల పంపిణీ కార్యక్రమంలో ఆమె పాల్గొని లబ్ధిదారులకు సొమ్ము అందజేశారు. జిల్లావ్యాప్తంగా 24 రకాల పెన్షన్లకు సంబంధించి 2,26,127 మంది లబ్ధిదారులకు రూ.97,40,46,500 పెన్షన్ల మొత్తాన్ని పంపిణీ చేస్తామన్నారు. డిఆర్‌డిఎ పీడీ ఎంఎస్ఎస్.వేణుగోపాల్, ఎపిఒ ఎం.శ్రీనివాస్‌ప్రసాద్, భీమవరం మున్సిపల్ కమిషనర్ కె.రామచంద్రారెడ్డి, సహాయ కమిషనర్ బి.రాంబాబు, జనసేన నేత కొప్పినీడు బాబి పాల్గొన్నారు.

పెన్షన్ సొమ్ము అందిస్తున్న కలెక్టర్ నాగరాణి

డ్రెయినేజీని పున: నిర్మించాలి

సిపిఎం వేల్పూరు గ్రామ కార్యదర్శి బళ్ల చినవీరభద్రావు

వినతిని అందజేస్తున్న నాయకులు

తణుకు : వేల్పూరు గ్రామంలోని 10వ వార్డులో శిథిలావస్థకు చేరుకుని ఉన్న డ్రెయినేజీని పున : నిర్మాణం చేపట్టాలని సిపిఎం వేల్పూరు గ్రామ కార్యదర్శి బళ్ల చినవీరభద్రరావు అధికారులకు విజ్ఞప్తి చేశారు. బుధవారం సిపిఎం వేల్పూరు గ్రామ కమిటీ ఆధ్వర్యంలో స్థానిక సాలిపేట 10వ వార్డులో డ్రెయినేజీ నిర్మాణం చేపట్టాలని కోరుతూ ఇంటింటికీ తిరిగి సంతకాల సేకరణ చేశారు. అనంతరం స్థానిక గ్రామ పంచాయతీ బిల్లు కలెక్టర్ కోలా శ్రీనివాస్‌కి ప్రజల వద్ద నుండి సేకరించిన సంతకాలతో కూడిన వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా వీరభద్రరావు మాట్లాడుతూ 10వ వార్డులో శలా కోటి నరసింహమూర్తి ఇంటి వద్ద నుండి సప్పరపు నాగేశ్వరరావు ఇంటి ముందు వరకు ఉన్న డ్రెయినేజీలో ప్రజలు వాడిన వాడకం నీరు పారుదల లేక డ్రెయినేజీలో మురుగు నీరు నిలిచిపోయి విపరీతమైన దుర్వాసన వస్తుందని తెలిపారు. సమస్యను తక్షణం పరిష్కరించాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ శాఖా కార్యదర్శి వాసా వెంకటేశ్వరరావు, శలాకోటి నరసింహమూర్తి, అందే మల్లేశ్వరరావు, తాడిశెట్టి సత్యనారాయణ పాల్గొన్నారు.

ఘనంగా అంతర్జాతీయ వృద్ధుల దినోత్సవం

పలుచోట్ల వృద్ధులకు సన్మానం

ఆకివీడులో వృద్ధులకు సన్మానం

నరసాపురం
అంతర్జాతీయ వృద్ధుల సంక్షేమ దినోత్సవం సందర్భంగా నరసాపురం మండల న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో పీచుపాలెం బొండమ్మ వృద్ధాశ్రమంలో ఉన్న వృద్ధులకు నామినేటెడ్ సభ్యులు వైడి.ఫణికర్, ప్యానెల్ లాయర్స్ కె.చిట్టి పద్మజ, కె.శిరీష, బ్రెడ్, పండ్లు అందించారు. న్యాయ సేవాధికార సంస్థ ద్వారా ఉచిత న్యాయ సహాయం పొందే అవకాశం ఉందన్నారు. ఆశ్రమంలో ఉన్న వృద్ధులందరికీ వృద్ధాప్య పింఛన్లు అందుతున్నదీ, లేనిదీ అడిగి తెలుసుకున్నారు. తమకు ఆస్తి సమస్యలు, పిల్లల నుండి ఏమైనా న్యాయపరమైన సమస్యలు ఎదురైతే నరసాపురం న్యాయ సేవా సంస్థ ద్వారా ఉచిత న్యాయ సహాయం పొందవచ్చన్నారు. ఆశ్రమం నిర్వాహకులు షేక్ అబ్దుల్ రహీమ్ పాల్గొన్నారు.

ఆకివీడు : తల్లిదండ్రులను, పెద్దలను గౌరవించడం, అభిమానించడం, వారి అవసరాలకు ఆదుకోవడం ప్రతి ఒక్కరి కనీస బాధ్యత అని పలువురు వక్తలు పేర్కొన్నారు. అంతర్జాతీయ వృద్ధుల దినోత్సవం సందర్భంగా స్థానిక లయన్స్ క్లబ్ హాలులో లయన్స్ క్లబ్ ఆకివీడు, లయన్స్ క్లబ్ ఆఫ్ అభయ, లయన్స్ క్లబ్ ఆఫ్ ఆదర్శ సహకారంతో సర్ ఆర్థర్ కాటన్ వృద్ధుల సంక్షేమ సంఘం ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించింది. ఈ సందర్భంగా జరిగిన సభకు బంగారయ్య అధ్యక్షత వహించి మాట్లాడారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ సునీతరావు, పుప్పాల సత్యనారాయణ, చంద్రశేఖర రావు, కందుల అప్పారావు, ఎ.లక్ష్మి, కె.బంగార్రాజు, ఎండి అహ్మద్, వృద్ధుల సంఘ కార్యదర్శి అడవి సుబ్బారావు, పేర్ల ప్రసాద్, బంగారయ్య సభ్యులను సత్కరించారు. అనంతరం సుమారు 150 మంది పేద వృద్ధులకు బట్టలు, భోజనాలు పంపిణీ చేశారు.

తాడేపల్లిగూడెం : ప్రపంచ వృద్ధుల దినోత్సవం సందర్భంగా సీనియర్ సిటిజన్స్ సంక్షేమ సంఘం తాడేపల్లిగూడెం యూనిట్ ఆధ్వర్యంలో పడాల జీవన సంధ్య వృద్ధుల ఆశ్రమంలో వృద్ధులకు దుప్పట్లు, పండ్లు పంపిణీ చేసి అన్నదానం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అఖిల భారత సీనియర్ సిటిజెన్ సంక్షేమ సంఘం జాయింట్ సెక్రటరీ వి.వీరారావు, సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షులు ఎ.సత్యనారాయణ, తాలూకా యూనిట్ అధ్యక్షులు కె.బాలకృష్ణ మాట్లాడారు. స్థానిక ఆర్అండ్‌బి గ్రౌండ్స్ వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యాన సీనియర్ సిటిజెన్స్‌కు సైకిల్, నడక, షెటిల్ పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా పేరిచర్ల మురళీకృష్ణంరాజు మాట్లాడుతూ వృద్ధాప్యంలో శారీరక, మానసిక క్షీణత ఉంటుందని, వారిలో మానసిక ధైర్యం నింపేందుకు ఈ కార్యక్రమం చేపట్టామన్నారు.

నూతన ఉపాధ్యాయులకు అభినందన

ఆచంట : ఇటీవల ప్రకటించిన డిఎస్‌సి ఫలితాల్లో కొడమంచిలి గ్రామానికి చెందిన ఏడుగురు విద్యార్థులు మెరిట్ సాధించి ఉపాధ్యాయులుగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా బుధవారం కొడమంచిలి రైతు కమ్యూనిటీ హాల్‌లో కూటమి నాయకుల ఆధ్వర్యాన ఆ విద్యార్థులను ఘనంగా సన్మానించి సత్కరించారు. ఈ కార్యక్రమంలో బాలం వెంకటరమణ, మన్నే సత్యనారాయణమూర్తి, చిలుకూరు శ్రీనివాస్, కుసుమే నరసింహమూర్తి, వెంకటేశ్వరరావు, శ్రీనివాసరావు, సత్యనారాయణ పాల్గొన్నారు.

పిహెచ్‌సికి దుప్పట్లు, గ్రీన్ క్లాత్ వితరణ

పోడూరు : పోడూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి గ్రామానికి చెందిన కోసూరి సత్యసూర్యనారాయణ రాజు రోగులకు ఉపయోగపడే 6 దుప్పట్లు, ప్రసవ సమయంలోను, కుటుంబ నియంత్రణ, శస్త్ర చికిత్సలకు ఉపయోగించే గ్రీన్ క్లాత్‌ను వితరణగా ఇచ్చారు. ఈ సందర్భంగా పిహెచ్‌సిలో బుధవారం జరిగిన కార్యక్రమంలో పాలకొల్లు ఏరియా ఆసుపత్రి డాక్టర్ డి.పీయూషా వర్మ మాట్లాడుతూ పెద్ద వయసులో రోగులకు మేలు చేసే విధంగా ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి దుప్పట్లు, గ్రీన్ క్లాత్ ఇవ్వడంపై దాత సత్య సూర్యనారాయణ రాజుకు కృతజ్ఞతలు తెలియజేసి అభినందించారు. ఈ కార్యక్రమంలో కోసూరి విజయ వర్మ, కోసూరి విక్రమ్ వర్మ, కె.రమేష్ రెడ్డి, సిహెచ్ఒ జె. సత్యనారాయణ, ఎంపిహెచ్ఇఒ, హెల్త్ సిబ్బంది వీరమ్మ, మీరమ్మ, పద్మ ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

రామేశ్వరస్వామి నూతన పాలకవర్గ ప్రమాణ స్వీకారం


ప్రమాణస్వీకారం చేస్తున్న సభ్యులు

ఆచంట : ప్రముఖ పుణ్యక్షేత్రం ఆచంట రామేశ్వర స్వామి ఆలయ అభివృద్ధికి నూతన పాలకవర్గ సభ్యులు కృషిచేయాలని ఎంఎల్‌ఎ పితాని తనయుడు పితాని వెంకట్ అన్నారు. బుధవారం ఆచంట రామేశ్వర స్వామి ఆలయం ఆవరణలో నూతన పాలకవర్గ ప్రమాణ స్వీకారం టిడిపి మండల అధ్యక్షులు చిలుకూరి సీతారాం అధ్యక్షతన అట్టహాసంగా నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ కార్యనిర్వహణాధికారి ఆదిమూల వెంకట సత్యనారాయణ పాలకవర్గ సభ్యులచే ప్రమాణం చేయించారు. అనంతరం ఆలయ ఛైర్మన్‌గా నెక్కంటి గజేశ్వరావును ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ధర్మకర్తలుగా మన్నే విజయలక్ష్మి, పెచ్చెట్టి సత్యనారాయణ, బి.రేవతి, పూసల ఏడుకొండలు, మడిచర్ల వెంకట ఉష, మధుర మీనాక్షి, వి.రవీంద్రకుమార్, ఎన్.నరసింహారావు, ఎస్.దేశాలమ్మ, శంకరమంచి ఉమామహేశ్వర రావు(అర్చకులు) ధర్మకర్తలుగా ప్రమాణం చేశారు. ఈ కార్యక్రమంలో కూటమి నేతలు గొడవర్తి శ్రీరాములు, తమ్మినీడి ప్రసాద్, బలుసు శ్రీరామమూర్తి, జవ్వాది బాలాజీ శ్రీనివాస్, కేత మీరయ్య, బీరా నరసింహమూర్తి, మాధవి లత, శ్రీనివాస్, గ్రామస్తులు, పాలకమండలి సభ్యులకు పూలమాలలు వేసి అభినందించారు.

మాసేనమ్మ దేవస్థానం ఆలయ ఛైర్మన్‌గా సుబ్బారావు

మండలంలోని పెదమల్లం మాచేనమ్మ పల్లాలమ్మ అమ్మవారి దేవస్థానం ఆలయ కమిటీ సభ్యుల ప్రమాణ స్వీకారం బుధవారం సాయంత్రం అట్టహాసంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ఎంఎల్‌ఎ పితాని తనయుడు పితాని వెంకట్, డిసిఎంఎస్ ఛైర్మన్ చాగంటి చిన్న పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆలయ కార్యనిర్వహణాధికారి ఆదిమూల వెంకట సత్యనారాయణ బోర్డు సభ్యుల చేత ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ సందర్భంగా ఆలయ ఛైర్మన్‌గా బోడపాటి సుబ్బారావు(బాబులు) ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మరో పదిమంది ధర్మకర్తలుగా ప్రమాణ స్వీకారం చేశారు.

నిబంధనలకు విరుద్ధంగా ఉన్న చెరువులు ధ్వంసం

వాండ్రం మాజీ ఉపసర్పంచి మత్తే రాజ్‌కుమార్

ఉండి : నిబంధనలకు విరుద్ధంగా మురుగుపారుదల సౌకర్యం లేకుండా ఉన్న ఆక్వా చెరువులను వెంటనే ధ్వంసం చేయాలని వాండ్రం గ్రామ మాజీ ఉపసర్పంచి, ఏఐసిఎఫ్ వర్కింగ్ ప్రెసిడెంట్ మత్తే రాజ్‌కుమార్ డిమాండ్ చేశారు. బుధవారం మండలంలోని వాండ్రం గ్రామంలో ఇసుక్కోడు బోదెను పరిశీలించిన మత్స్య శాఖ అభివృద్ధి అధికారి వివేక్ ను కలిసి వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా రాజ్ కుమార్ మాట్లాడుతూ పెదఅమిరం ఆయకట్టు రైతులు నిబంధనలకు విరుద్ధంగా ఆక్వా చెరువులను మురుగు పారుదల సౌకర్యం లేకుండా తవ్వడంతో వారు ఆక్వా వ్యర్ధ జలాలను తమ గ్రామంలోని ఇసుక్కోడు లోకి వదిలేయడమే కాకుండా తమ దళితవాడ ప్రజలను ఇబ్బందులకు గురి చేస్తున్నారన్నారు. దీనివల్ల తమ ఇల్లు ముంపుకు గురై ఇబ్బందులు పడుతున్నామని ఇటీవల జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణికి మీకోసం కార్యక్రమంలో ఫిర్యాదు చేయడం జరిగిందన్నారు. ఆ ఫిర్యాదు మేరకు అధికారులు వాటిని పరిశీలించడానికి రావడంతో మత్స్యశాఖ అధికారులను కలిసి ఆ చెరువులపై చర్యలు తీసుకోవాల్సిందిగా కోరడం జరిగిందని ఆయన తెలిపారు. వినతిపత్రం అందించిన వారిలో వాండ్రం సంఘ పెద్దలు కోణాల రాజేంద్ర, పలువురు సభ్యులు ఉన్నారు.

ప్రజాశక్తి
ప్రతి అక్షరం - ప్రజల పక్షం
పత్రిక పంపిణీలో ఇబ్బందులున్నవారు
ఈక్రింది నెంబర్లను సంప్రదించండి
ఏలూరు జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 94900 99190
పశ్చిమగోదావరి జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 83339 88814

రాచరికం ఉట్టిపడేలా దసరా వేడుకలు

రెండో మైసూరుగా నూజివీడుకు జాతీయ ఖ్యాతి
73 ఏళ్లుగా అఖిలభారత చెడుగుడు పోటీలు
పురుషులకు, మహిళలకు ప్రత్యేకంగా
నేటి నుంచి ప్రారంభం
ప్రత్యేక ఆకర్షణగా బుట్టబొమ్మలు
వేడుకలకు అన్ని ఏర్పాట్లు పూర్తి

మురళి

సత్యనారాయణ

ప్రజాశక్తి - నూజివీడు టౌన్

నూజివీడు పట్టణం అనగానే నోరూరించే మామిడి ఫలాలు... దసరా వేడుకలు... బుట్ట బొమ్మలు... యువతను ఉత్సాహపరిచే చెడుగుడు పోటీలు ప్రపంచవ్యాప్తంగా తెలుగు ప్రజలకు ఇట్టే గుర్తుకువస్తాయి. రాచరికపు పాలన నుంచి 500 ఏళ్లకు పైగా గొప్ప ఘన చరిత్ర కలిగిన నూజివీడు సంస్థానంలో దసరా వేడుకలు నిర్వహించడం అనాధిగా వస్తున్న సాంప్రదాయం. ఇదే సాంప్రదాయాన్ని కొనసాగిస్తూ స్పోర్టింగ్ క్లబ్, దేవాదాయ ధర్మాదాయ శాఖల సమన్వయంతో దసరా వేడుకలను అంగరంగ వైభవంగా నిర్వహిస్తున్నారు. ప్రస్తుతం దసరా ఉత్సవ, క్రీడా సాంస్కృతిక ట్రస్ట్‌గా రిజిస్టర్డ్ అయి దసరా వేడుకలను వైభవోపేతంగా నిర్వహించేందుకు సకల సన్నాహాలు చేశారు. నూజివీడు సంస్థానానికి చెందిన ఉయ్యూరు ఎస్టేట్ జమిందార్ కళా ప్రపూర్ణ రాజా వెంకటాద్రి అప్పారావు బహదూర్, ఎలమర్రు ఎస్టేట్ జమీందార్ రాజా మేక శోభనాద్రి అప్పారావు బహదూర్, ఉయ్యూరు ఎస్టేట్ జమిందార్ డాక్టర్ ఎంఆర్.అప్పారావు బహదూర్, మీర్జాపురం ఎస్టేట్ జమీందార్ ఎన్‌విఎస్‌విజి.అప్పారావు బహదూర్‌ల ఆధ్వర్యంలో జాతీయ స్థాయి ఖ్యాతి పొందేలా దసరా వేడుకలను నిర్వహించడం ద్వారా రెండో మైసూరుగా ఖ్యాతి పొందింది.

బుట్టబొమ్మలు

తోవల్లి వెంకటప్పయ్య, మేజర్ ఎన్.రామారావు, కోన పులి సుబ్రహ్మణ్యం, దారుగ బాలకృష్ణ ర(రిఫరీ)ల ఆధ్వర్యంలో 60 మంది సభ్యులతో 1952వ సంవత్సరంలో నూజివీడు స్పోర్టింగ్ క్లబ్ ఏర్పాటైంది. ఆనాటి నుంచి అఖిల భారత స్థాయి చెడుగుడు పోటీలను నిర్విరామంగా నిర్వహించేవారు. మొదటి మూడేళ్లు జై వీర హనుమాన్ పేరుతో రామిశెట్టి వీరరాఘవులు కెప్టెన్‌గా నూజివీడు టీమ్ విజేతగా నిలిచింది. ఆనాటి ఉయ్యూరు ఎస్టేట్ జమిందార్ కళా ప్రపూర్ణ రాజా వెంకటాద్రి అప్పారావు బహదూర్ దసరా ఉత్సవ నిర్వహణ బాధ్యతను నూజివీడు స్పోర్టింగ్ క్లబ్ వారికి అందించారు. ఆనాటి నుంచి దసరా ఉత్సవాలు, అఖిల భారత చెడుగుడు పోటీలు నిర్విరామంగా నిర్వహిస్తున్నారు. ఉయ్యూరు ఎస్టేట్ జమిందార్ ఎంఆర్.అప్పారావు, ఎలమర్రు ఎస్టేట్ జమిందార్ మేక శోభనాద్రి అప్పారావు, ఎంవిఎస్‌విజి.అప్పారావులు నూజివీడు స్పోర్టింగ్ క్లబ్ చెడుగుడు పోటీలను ఎంతగానో ప్రోత్సహించేవారు. క్రీడాకారులైన పరిమిశెట్టి బాలకృష్ణ, బొబ్బిలి కొండలరావు ఆధ్వర్యంలో స్పోర్టింగ్ క్లబ్ సేవలు అజేయంగా నిలిచాయి. నూజివీడు చెడుగుడు మైదానంలో రాష్ట్ర, జాతీయ స్థాయిలో పేరుపొందని ఎందరో క్రీడాకారులు తమ ప్రతిభ పాటవాలను చాటి అందరి అభిమానాన్ని పొందగలిగారు. వారిలో అవధాని, పునుకొల్లు సాంబయ్య, కనుమూరి సోదరులు, మంటాడ నాగేశ్వరరావు, రైల్వే కోటేశ్వరరావు,

గతేడాది మహిళల చెడుగుడు పోటీలు

గతేడాది పురుషుల చెడుగుడు పోటీలు

గుండుగొలను మాధవ, నల్ల రంగారావు, అంజిరెడ్డి, బసవయ్య, పహిల్వాన్, నెల్లూరు కాంతారావు (తెలుగు సినీ ప్రముఖ నటులు, నిర్మాత), జింబో, చెంచయ్య, కడవకొల్లు రమేష్ వంటి ప్రముఖులు ఇదే క్రీడా మైదానంలో నైపుణ్యాన్ని ప్రదర్శించి క్రీడాభిమానుల కళ్లల్లో మెరుపులు మెరిపించి మైమరిపించిన అద్భుతమైన దృశ్యాలు ఎన్నో చోటు చేసుకుని నేటికీ పదిలంగా సుస్థిరంగా ఉన్నాయి. సంప్రదాయ బద్ధంగా కొనసాగే చెడుగుడు పోటీల విజేతలకు బహుమతి ప్రదానం చేసే సమయంలో సినీ నటులు, దర్శకులు ఎస్‌వి.రంగారావు, ఎన్‌టి.రామారావు, అక్కినేని నాగేశ్వరరావు, రేలంగి, సూర్యకాంతం, నటశేఖర కృష్ణ, నటభూషణ శోభన్ బాబు, మహానటి సావిత్రి, విలక్షణ నటుడు రావుగోపాలరావు, హాస్యనటులు అల్లు రామలింగయ్య, దర్శకులు దాసరి నారాయణరావు, జంధ్యాల, చలం, తెలుగు నటి శారద, హాస్యనటులు సుధాకర్, సుత్తివేలు వంటి ప్రముఖులు ఎందరో తారాగణంగా హాజరై క్రీడాకారులను, అభిమానులను ఉత్సాహపరిచేవారు. స్పోర్టింగ్ క్లబ్ ప్రస్తుతం దసరా ఉత్సవ, క్రీడా సాంస్కృతిక ట్రస్ట్‌గా రిజిస్టర్డ్ అయి దసరా వేడుకలను నిర్వహించేందుకు ముందుకు వచ్చినట్లు స్పోర్టింగ్ క్లబ్ అధ్యక్ష కార్యదర్శులు రామిశెట్టి మురళీకృష్ణ కుమార్, పగడాల సత్యనారాయణ తెలిపారు.

సమస్య పరిష్కార మార్గ నిర్దేశకులు శ్రీనివాస్

రాజ్యసభ సభ్యులు పాక వెంకట సత్యనారాయణ
ఘనంగా విస్సాకోడేరు సర్పంచి శ్రీనివాస్ పుట్టినరోజు

ప్రజాశక్తి - పాలకోడేరు

సమస్య వస్తే పక్కకు పోకుండా దాని పరిష్కారానికి మార్గం నిర్దేశించే వ్యక్తి విస్సాకోడేరు సర్పంచి బొల్ల శ్రీనివాస్ అని రాజ్యసభ సభ్యులు పాక వెంకట సత్యనారాయణ, వైసిపి నరసాపురం పార్లమెంటు కన్వీనర్ గూడూరి ఉమబాల, ఉండి నియోజకవర్గ వైసిపి ఇన్‌ఛార్జి పివిఎల్.నరసింహారాజు అన్నారు. విస్సాకోడేరు సర్పంచి బొల్ల శ్రీనివాస్ పుట్టినరోజు వేడుకలు ఆయన స్వగృహం వద్ద బుధవారం వివిధ పార్టీలకు చెందిన నేతలు, నాయకులు, కార్యకర్తలు, గ్రామస్తులు, కుల సంఘాలు, అభిమానుల నడుమ ఎంతో ఘనంగా జరిగాయి. సర్పంచి శ్రీనివాసులు, పలువురు ప్రముఖులు పుష్పగుచ్ఛాలు, పుష్ప మాలలు వేసి పుట్టినరోజు శుభాకాంక్షలు తెలియజేశారు. భారీ కేక్‌ను సర్పంచి శ్రీనివాస్ చేత కట్ చేయించి వారి అభిమానాన్ని చాటుకున్నారు. ఈ సందర్భంగా వారు


సర్పంచికి శుభాకాంక్షలు తెలుపుతున్న రాజ్యసభ సభ్యులు పాక

మాట్లాడుతూ గ్రామాన్ని అభివృద్ధి పథంలో నడిపించడంలో సర్పంచి శ్రీనివాస్ చేసిన సేవలు ఎనలేనివని కొనియాడారు. ముఖ్యంగా తోటి వారికి సహాయం అందించడంలో ముందు ఉంటారని చెప్పారు. సమస్యలు ఎన్ని వచ్చినప్పటికీ చాకచక్యంగా పరిష్కరించడంలో ఆయనకు ఆయనే అని అన్నారు. అనంతరం వృద్ధులకు చీరలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఉండి నియోజకవర్గ జనసేన ఇన్‌ఛార్జి జుత్తిగ నాగరాజు, పాలకోడేరు ఎంపిపి భూపతిరాజు సత్యనారాయణరాజు, మాజీ డిసిఎంఎస్‌సి ఛైర్మన్ వేండ్ర వెంకటస్వామి, సర్పంచులు గొట్టుముక్కల వెంకట శివరామరాజు(శివాజీ రాజు), జంగం సూరిబాబు, కడలి నాగేశ్వరి, చింతపల్లి చిన్న, మాజీ ఎంపిపి పాల వెంకట చలపతి, ఎంపిటిసి బొల్లం గాంధీ, ఉప సర్పంచి కందుల నాగరాజు, వివిధ పార్టీలకు చెందిన నేతలు కొత్తపల్లి కాశీ విశ్వనాథరాజు, మంతెన యోగేంద్ర కుమార్(బాబు), సహదేవరాజు, కోళ్ల ఫారం శ్రీను రాజు, ఉండ్రు శ్రీను, బాలం ప్రసాద్, దుండి అశోక్, శివుడు, చేబోలు బాలాజీ పాల్గొన్నారు.

పిఎంజె జువెల్స్ ప్రారంభం

8 రోజులపాటు ఆభరణాల ప్రదర్శన

భీమవరం టౌన్ : భీమవరం తహశీల్దార్ కార్యాలయం రోడ్డులో దక్షిణ భారతదేశంలోని ప్రముఖ లగ్జరీ ఆభరణాల సంస్థ పిఎంజె జువెల్స్‌ను బుధవారం ఎంఎల్‌ఎ పులపర్తి రామాంజనేయులు ప్రారంభించారు. పిఎంజె జువెల్స్ భారత్‌లోని 4 రాష్ట్రాల్లో 40 కంటే ఎక్కువ స్టోర్‌లను ప్రారంభించుకోవడం అభినందనీయమన్నారు. అభివృద్ధి చెందుతున్న భీమవరం పట్టణంకు కార్పొరేట్ సంస్థలు తరలి వస్తున్నాయన్నారు. ఎపి స్టేట్ హెడ్ హైదర్ అలీ, క్లస్టర్ మేనేజర్ షైక్ గాలి షరీఫ్, స్టోర్ మేనేజర్ ఆలపాటి శ్రీనివాస్, సేల్స్ మేనేజర్ సాయికృష్ణ మాట్లాడుతూ భీమవరం స్టోర్‌లో 8 రోజులపాటు పెళ్లి, హాఫ్ శారీ ఆభరణాల ప్రదర్శన జరగనుందని, ఈనెల 8వ తేదీ వరకు కొనసాగుతుందన్నారు. టెంపుల్ జ్యువెలరీ, పురాతన బంగారు నెక్లెస్‌లు, వడ్డాణాలు, ప్రత్యేక పెళ్లి సెట్లు, హాఫ్ శారీ జ్యువెలరీతోపాటు వజ్రాలు, రంగుల రత్నాలు, కుందన్, పోల్కీ, జడావు వర్క్‌తో అలంకరించబడిన ఆభరణాలు, నెక్లెస్లు, చెవిపోగులు, రింగులు వంటి తేలికపాటి రోజువారీ ధరించే ఆభరణాలు లభిస్తున్నాయన్నారు. కార్యక్రమంలో ఎపిసిసిఐ డైరెక్టర్ చెనమల్ల చంద్రశేఖర్, ఎఎంసి వైస్ ఛైర్మన్ బండి రమేష్, పత్తి హరివర్ధన్, యర్రంశెట్టి శివకృష్ణ, కారుమూరి సత్యనారాయణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

రైతు బాగుంటేనే అన్నీ బాగుంటాయి

జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి
జిఎస్‌టి తగ్గింపుపై పలుచోట్ల ట్రాక్టర్ ర్యాలీ

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

రైతుకు బాసటగా నిలిచేందుకు జిఎస్‌టి స్లాబులను మదింపు చేయడం జరిగిందని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి తెలిపారు. బుధవారం తాడేపల్లిగూడెం ఎస్‌విఆర్ సర్కిల్‌లో సూపర్ జిఎస్‌టి, సూపర్ సేవింగ్స్ ప్రచార కార్యక్రమంలో భాగంగా వాణిజ్య పన్నులు, వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన వ్యవసాయ పనిముట్లు, యంత్ర పరికరాల ప్రదర్శనను జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి, శాసనసభ్యులు బొలిశెట్టి శ్రీనివాస్, జిల్లా జాయింట్ కలెక్టర్, జిఎస్‌టి నోడల్ అధికారి టి.రాహుల్‌కుమార్ రెడ్డి ప్రారంభించారు. జిఎస్‌టి తగ్గింపుకు ముందు తర్వాత రైతులకు కలిగిన ఆర్థిక ప్రయోజనాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి మాట్లాడుతూ జిఎస్‌టి సవరించిన రేట్లు సెప్టెంబర్ 22 నుండి అమల్లోకి వచ్చాయని, పేద, మధ్యతరగతి ప్రజలకు, రైతుల సంక్షేమానికి దోహదపడుతుందన్నారు. జిఎస్‌టి స్లాబులు తగ్గింపుతో వివిధ వస్తువులు, సేవలు తగ్గడం వల్ల కలిగే ప్రయోజనాల గురించి లబ్ధిదారుల్లో అవగాహన పెంచడానికి నెల రోజుల పాటు ప్రచారాన్ని ప్రారంభించడం జరిగిందన్నారు. ప్రభుత్వ విప్, ఎంఎల్‌ఎ బొలిశెట్టి శ్రీనివాస్ మాట్లాడారు. కార్యక్రమంలో జెసి, జిఎస్‌టి నోడల్ అధికారి టి.రాహుల్ కుమార్ రెడ్డి, ఏలూరు డివిజన్ వాణిజ్య పన్నుల డిప్యూటీ కమిషనర్ కెపి శైలజశ్రీ, వ్యవసాయ శాఖ జాయింట్ డైరెక్టర్ జెడ్.వెంకటేశ్వరరావు, వాణిజ్య పన్నుల శాఖ భీమవరం, తణుకు సర్కిల్స్ జిఎస్‌టి అసిస్టెంట్ కమిషనర్లు వి.కేదారేశ్వరరావు, కెవి.శ్రీనివాసరావు, మున్సిపల్ కమిషనర్ ఏసుబాబు, అధికారులు పాల్గొన్నారు.

యలమంచిలి : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల జిఎస్‌టి తగ్గింపు ద్వారా రైతాంగానికి భారీగా లబ్ధి చేకూరిందని రాష్ట్ర జలవనరుల శాఖామంత్రి డాక్టర్ నిమ్మల రామానాయుడు అన్నారు. యలమంచిలి గ్రామంలో బుధవారం జిఎస్‌టి తగ్గింపుతో రైతుల ఆధ్వర్యంలో జరిగిన అవగాహన ట్రాక్టర్ల ర్యాలీలో ఆయన పాల్గొన్నారు. స్వయంగా ట్రాక్టర్ నడిపి రైతాంగంలో ఉత్సాహాన్ని నింపారు. అనంతరం జిఎస్‌టి తగ్గింపు ద్వారా కలిగే అవగాహన శిబిరాన్ని ప్రారంభించారు. అంతకుముందు వృద్ధురాలికి పెన్షన్ సొమ్మును అందజేశారు. ఆమె యోగక్షేమాలు అడిగారు. కట్టెల పొయ్యిపై వంట చేయడం చూసి గ్యాస్ స్టవ్, సిలిండరు కనెక్షన్ ఇస్తానంటూ భరోసా ఇచ్చారు. గత ప్రభుత్వంలో ఒక నెల తీసుకోకపోతే పెన్షన్ ఇచ్చేవారు కాదని, నేడు చంద్రబాబు మూడు నెలల వరకు ఒకేసారి ఇచ్చే అవకాశాన్ని కల్పించారన్నారు. అందువల్లనే రెండు నెలల సొమ్ము కలిపి ఇస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమాల్లో టిడిపి మండల అధ్యక్షులు మామిడిశెట్టి పెద్దిరాజు, నాయకులు బొప్పన హరి కిషోర్, పీతల శ్రీనివాస్, తాళ్ల నాగరాజు పాల్గొన్నారు.

అత్తిలి(తణుకు) : జిఎస్‌టి 2.0 సంస్కరణలతో రైతులకు ఎంతో ప్రయోజనం చేకూరుతోందని తణుకు ఎంఎల్‌ఎ

తాడేపల్లిగూడెంలో ట్రాక్టర్ నడుపుతున్న కలెక్టర్

ఆరిమిల్లి రాధాకృష్ణ అన్నారు. బుధవారం అత్తిలి మండలంలో సూపర్ జిఎస్‌టి-సూపర్ సేవింగ్ పేరుతో నిర్వహించిన అవగాహన సదస్సు, ర్యాలీలో ఆయన పాల్గొని మాట్లాడుతూ.. రైతులకు వ్యవసాయ యంత్ర పరికరాలతో పాటు సూక్ష్మ పోషకాలు, జీవన ఎరువులు, జీవన పథకాలు తదితర వస్తువులపై జిఎస్‌టిలో వచ్చిన మార్పుల కారణంగా రైతులకు లబ్ధి చేకూరుతోందని తెలిపారు. గతంలో 12 శాతం ఉన్న జిఎస్‌టిను 5 శాతానికి తగ్గించడం వల్ల యాంత్రీకరణ పరికరాలపై రైతులకు మేలు జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ, రెవెన్యూ శాఖ అధికారులతో పాటు కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

నరసాపురం: జిఎస్‌టి తగ్గింపు ప్రజలకు ఉపశమనం, వ్యాపారానికి ఊపిరి అని నరసాపురం ప్రభుత్వ విప్, ఎంఎల్‌ఎ బొమ్మిడి నాయకర్ అన్నారు. బుధవారం పట్టణంలోని పలు షాపులలో ఎంఎల్‌ఎ నాయకర్, టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి పొత్తూరి రామరాజు కలిసి పలు వ్యాపారులతో మాట్లాడారు. ఈ సందర్భంగా నాయకర్ మాట్లాడుతూ సిఎం చంద్రబాబునాయుడు, పిఎం ప్రధానమంత్రి నరేంద్ర మోడీ తీసుకున్న ఈ నిర్ణయం ప్రజలకు మేలు కలిగించే చారిత్రాత్మక అడుగు అని అన్నారు. ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మత్స్యకారుల అభివృద్ధి సంస్థ కార్పొరేషన్ ఛైర్మెన్ కొల్లు పెద్దిరాజు, జనసేన పట్టణ అధ్యక్షులు కోటిపల్లి వెంకటేశ్వరరావు, జిల్లా మత్స్యకార అధ్యక్షులు మైల వసంతరావు, వాతాడి కనకరాజు, దేశనీడి గంగాధర్, ఎఎంసి ఛైర్మన్ జక్కం శ్రీమన్నారాయణ, రాగూర్, బందేల రవీంద్ర, గంటా కృష్ణ, పోలిశెట్టి నళిని పాల్గొన్నారు.

ఆచంట : సూపర్ జిఎస్‌టి-సూపర్ సేవింగ్స్ కార్యక్రమంలో భాగంగా మండల స్థాయిలో బుధవారం ట్రాక్టర్లచే ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పాలకొల్లు ఎడిఎ పి.మురళీకృష్ణ, ఎంఎల్‌ఎ పితాని తనయుడు పితాని వెంకట్ ముఖ్య అతిథిగా పాల్గొని ట్రాక్టర్ ర్యాలీ ప్రారంభించారు. ఆచంట గ్రామంలోని ప్రధాన రహదారుల వెంబడి ట్రాక్టర్ల ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షులు చిలుకూరి సీతారాం, జనసేన అధ్యక్షులు జవాది బాలాజీ, ఎంపిడిఒ బిఎస్ఎస్.కృష్ణమోహన్, ఎఒ బి.నాగరాజు, వివిధ గ్రామాల సర్పంచులు పాల్గొన్నారు.

మొగల్తూరు : ప్రభుత్వం ఇటీవల చేపట్టిన చర్యలతో వ్యవసాయ పనిముట్లు భారీగా ధరలు తగ్గి అందుబాటులోకి వచ్చాయని ఎంపిడిఒ సిహెచ్.త్రిశూలపాని అన్నారు. మండలకేంద్రం మొగల్తూరులోని బుధవారం ప్రజాప్రతినిధులు, అధికారులు సూపర్ జిఎస్‌టి సూపర్ సేవింగ్స్‌పై అవగాహన ప్రదర్శన చేశారు. కార్యక్రమంలో వైస్ ఎంపిపి కైలా సుబ్బారావు, టిడిపి మండల అధ్యక్షులు గుబ్బల నాగరాజు, టౌన్ ప్రెసిడెంట్ బొల్లా చంటి, పాల రాంబాబు, కాసాని ప్రసాద్, బోణం నరసింహరావు, దేశంశెట్టి శ్రీనివాస్ పాల్గొన్నారు.

పెనుమంట్ర : ప్రభుత్వం ఇస్తున్న జిఎస్‌టి ప్రయోజనాలను ఇంటింటికి తీసుకు వెళ్లేలా చర్యలు చేపట్టాలని అధికారులకు, కూటమి ప్రజా ప్రతినిధులకు, నాయకులకు మాజీ మంత్రి, ఆచంట ఎంఎల్‌ఎ పితాని సత్యనారాయణ పిలుపునిచ్చారు. మండలంలోని ఆలమూరు గ్రామపంచాయతీ వద్ద జిఎస్‌టి 2.0పై కార్యచరణకు శ్రీకారం చుట్టారు. గ్రామపంచాయతీ నుండి రాపాక ఛానల్ వరకు ప్లే కార్డులు ధరించి నడకతో ర్యాలీ నిర్వహించిన అనంతరం సుమారు 55 ట్రాక్టర్లతో రైతులు నిర్వహించిన కృతజ్ఞతా ర్యాలీని కలెక్టర్ నాగరాణి పచ్చ జెండా ఊపి ప్రారంభించారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయాధికారి జెడ్.వెంకటేశ్వరరావు, వ్యవసాయ శాఖ ఎడిఎ ఎంవి.రమేష్, మండల తహశీల్దార్ వై.రవికుమార్, మండల వ్యవసాయ అధికారిణి బి.దేవిస్వరూప, సర్పంచి మేడప రెడ్డి వెంకటరమణ, ఎంపిటిసి పలివెల ఆశాలత ప్రేమ్ కుమార్ పాల్గొన్నారు.

పెనుగొండ : జిఎస్‌టి తగ్గింపు వల్ల కలిగే ప్రయోజనాలను వివరిస్తూ ఆచంట ఎంఎల్‌ఎ పితాని సత్యనారాయణ ఆధ్వర్యాన ట్రాక్టర్ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక ఎస్‌వికెపి కళాశాల నుండి సచివాలయం వరకు జరిగిన ర్యాలీలో కూటమి నాయకులు, ఎండిఒ సూర్య నారాయణ, తహశీల్దార్ అనిత కుమారి, వ్యవసాయాధికారి పి.స్పందన, అధికారులు పాల్గొన్నారు.

మరో పదేళ్లు అధికారంలో కూటమి ప్రభుత్వం

ఉనికిలి గ్రామ సభలో ఎంఎల్‌ఎ రాధాకృష్ణ

ప్రజాశక్తి - అత్తిలి(తణుకు)

మరో పదేళ్లపాటు టిడిపి కూటమి అధికారంలో ఉంటుందని తణుకు ఎంఎల్‌ఎ ఆరిమిల్లి రాధాకృష్ణ ఆశాభావం వ్యక్తంచేశారు. ఇందుకు సంబంధించి సాక్షాత్తూ ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ సైతం ఇటీవల ప్రకటన చేశారన్నారు. అత్తిలి మండలం ఉనికిలి గ్రామంలో బుధవారం గ్రామ సభ జరిగింది. తొలుత ఉనికిలి గ్రామ సర్పంచి వట్టికూటి అనంతలక్ష్మి, ఆమె భర్త, వార్డు సభ్యులు వట్టికూటి రాములు టిడిపి తీర్థం పుచ్చుకున్నారు. వీరిద్దరికీ ఎంఎల్‌ఎ రాధాకృష్ణ పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఎంఎల్‌ఎ రాధాకృష్ణ మాట్లాడుతూ.. 2014 నుండి 2019 వరకు టిడిపి హయాంలో జరిగిన అభివృద్ధిని వైసిపి ప్రభుత్వ హయాంలో నిర్లక్ష్యం చేసిందన్నారు. టిడిపి కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత జరుగుతున్న అభివృద్ధి, గతంలో వైసిపి ప్రభుత్వ హయాంలో జరిగిన అభివృద్ధిలో వ్యత్యాసం చూడాలన్నారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో మరోసారి టిడిపి కూటమిని అధికారంలోకి రావడానికి కృషి చేయాలని కోరారు. కూటమిలో టిడిపి, జనసేన, బిజెపిల నుంచి ఎవరు పోటీలో ఉన్నా వారిని అత్యధిక మెజార్టీతో గెలిపించడానికి ముందుకు రావాలని కోరారు. కూటమి ప్రభుత్వానికి ప్రజలంతా అండగా నిలబడటం ద్వారా రాబోయే రోజుల్లో గ్రామాల్లో అభివృద్ధి పనులు చేయడానికి అవకాశం ఉంటుందన్నారు. అత్తిలి మండలంలో పుంతరోడ్ల అభివృద్ధికి ప్రణాళికలు చేస్తున్నట్లు తెలిపారు. అనంతరం సొసైటీ ద్వారా రాయితీను రైతులకు ఎంఎల్‌ఎ రాధాకృష్ణ అందజేశారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

విశ్వకర్మ కిట్లు పంపిణీ

ప్రజాశక్తి - ఆచంట

మహిళలు ఆర్థిక పరిపుష్టి పొందేందుకుగాను విశ్వకర్మ కిట్లు అందజేసినట్లు టిడిపి గ్రామ కమిటీ అధ్యక్షులు గుడాల నాగ సత్యనారాయణ అన్నారు. ఆచంట వేమవరం గ్రామంలో ప్రధానమంత్రి విశ్వకర్మ కిట్లు(కుట్టుమిషన్లు) ఎంఎల్‌ఎ పితాని సత్యనారాయణ ఆదేశాల మేరకు కూటమి ప్రభుత్వం లబ్ధిదారులకు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో జనసేన అధ్యక్షులు గుత్తుల శేఖర్, ఉపాధ్యక్షులు దూది రాజు, బిజెపి గ్రామ అధ్యక్షులు నేలపాటి యేసురత్నం, గ్రామ ఎంపిటిసిలు, విశ్వనాధుల పద్మ, గుడాల లక్ష్మీ దుర్గ పాల్గొన్నారు.

మహిళ అదృశ్యం

ప్రజాశక్తి - కాళ్ల

నేరాలు - ఘోరాలు

ఇంటి నుంచి బయటకు వెళ్లిన మహిళ కనబడకుండా పోయిన ఘటన కాళ్ల పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. కాళ్ల పోలీసులు బుధవారం కేసు నమోదు చేశారు. ఈ ఘటనకు సంబంధించి పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. పెనుమంట్ర మండలం ఆలమూరు గ్రామానికి చెందిన ముప్పిడి స్వప్న(23) సెప్టెంబర్ 30వ తేదీ ఉదయం 11 గంటల సమయంలో పెదఅమిరం గ్రామంలో మామ ఇంటి నుండి ఎటువంటి సమాచారం ఇవ్వకుండా వెళ్లి తిరిగి రాలేదు. దీంతో ఆమె భర్త ముప్పిడి నాని కాళ్ల పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈమేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. ఫిర్యాదుదారు అనుమానం ప్రకారం బట్లమగుటూరు గ్రామానికి చెందిన గోలసన రాము, పెదఅమిరం గ్రామంలోని అత్తమామలపై అనుమానం వ్యక్తం చేశారు. ప్రస్తుతం పోలీసులు గాలింపు చర్యలు చేపట్టి కనిపించకపోయిన మహిళను వెతికే ప్రయత్నాలు చేస్తున్నారు.

IN THE COURT OF THE PRINCIPAL CIVIL JUDGE (JUNIOR DIVISION), KOVVUR
E.P. No. 21/2024
FD I.A. No. 7/2022
O.S. No. 357/2019

Between:
Smt. Gadi Ramalakshmi
...D.Hr/Petitioner/Plaintiff
AND
Smt. Jakka Malathi.
...J.Dr/Respondent/Defendant

To:
J.Dr/Respondent/Defendant:
Smt. JakkaMalathi, W/o. Somraju @ Somaraju, Age 40 Years, resident of D.No. 23-12-7/9, Vemuri Residency, Flat No. 302, Opp: ESI Hospital, PenumatsaVari Street, Sajjapuram, Tanuku, W.G.Dt.,

పై నెంబరు గ్రంథములో E.P సంగతులు తెలియజేయు నిమిత్తం J.Dr/ Respondent/ Defendant అయిన మీకు కోర్టు ద్వారాను మరియు రిజిస్టర్ పోస్ట్ ద్వారాను Order 21 Rule 66 CPC క్రింద ఎన్ని పర్యాయాలు E.P నోటీసులు పంపినప్పటికీ సదరు J.Dr/ Respondent/ Defendant బుద్ధి పూర్వకముగా avoid చేయుచున్న కారణంగా శ్రీ కోర్టువారు ఉత్తర్వుల ప్రకారం పేపరు ప్రచురణ ద్వారా E.P సంగతులు తెలియజేయడమైనది. పై నెంబరు E.P లో మీకు ఏవైనా అభ్యంతరములు వున్న యెడల **ది. 14-10-2025వ తేదిన ఉదయం 10-30 ని॥లకు** శ్రీ కోర్టువారి ఎదుట మీరు స్వయంగా కానీ, ప్లీడరు గారి ద్వారా గాని హాజరై ఏమైనా ఆక్షేపణలు వున్న యెడల తెలియపర్చుకోవచ్చును. లేని యెడల వారి పరోక్షమున తీర్మానించడమగునని ఇందు మూలముగా తెలియజేయడమైనది.

వాయిదా : 14-10-2025

వల్లభశెట్టి సురేష్
D.Hr/ పిటిషనర్/ వాది తరపు అడ్వకేట్
కొవ్వూరు Cell. 9299908580.
ది. 29-09-2025 కొవ్వూరు, తూ॥గో॥జిల్లా

S.R.K.R. ENGINEERING COLLEGE (AUTONOMOUS)
Accredited by AICTE, New Delhi and Affiliated to JNTUK, Kakinada, NAAC with A+ Grade, CHINNA AMIRAM (PO) :: BHIMAVARAM, W.G.Dt.
☎ 98488 23332
SPOT ADMISSIONS: APECET-2025
Vacant Seats in the 2nd Year B.Tech (Lateral Entry) that may arise out of non-reporting of the students to be filled by the college under Spot Admissions. Interested and eligible candidates (As per APSCHE Guidelines available in ECET-2025 Admissions Website) are requested to approach the college with their original certificates and get themselves registered for the admission on or before 05-10-25. The admission made is provisional and is subjected to ratification by APSCHE and JNTUK.
Note: The Students who are admitted under spot admissions are not eligible for the fee reimbursement by the Govt of Andhra Pradesh.
Principal